క్లుప్తంగా

బాల రాజులుబాబు ఆలయం ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

గొలుగొండ: పాకలపాడులో నూతనంగా నిర్మించిన బాల రాజులుబాబు ఆలయాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆలయాలు నిర్మించడం వల్ల భక్తిభావం పెరుగుతుందని తెలిపారు. ఇక్కడ కిల్లాడ రాజుబాబు కుటుంబ సభ్యుల ఇలవేల్పుగా ఆలయాన్ని నిర్మించారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ రాజాన పద్మ పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ గూడెపు రాము

దేవరాపల్లి: గరిశింగి పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ. 60 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు గరిశింగి–దొర్రి చెరువు రోడ్డు నుంచి డీలర్ కల్లాల వరకు రూ. 30 లక్షలతోను, మరో రూ. 30 లక్షలతో గరిశింగి ఎస్సీ కాలనీ సహా ఇతర అంతర్గత సీసీరోడ్ల నిర్మాణానికి సర్పంచ్ గూడెపు రాము గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయ కన్వీనర్ గూడెపు మోహన్, కొరతం రాజబాబు, దువ్వార చిలుకు, కిల్లి అప్పలనాయుడు, పెద్దాడ గురువునాయుడు పాల్గొన్నారు.

ఆలయ మండప నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ మండపానికి శంకుస్థాపన చేస్తున్న కిలపర్తి భాస్కరరావు

దేవరాపల్లి: స్థానిక ఎస్టీ మోడల్ కాలనీలో నూకాలమ్మ ఆలయ మండపం నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.5 లక్షలతో దీన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీని నిర్మాణానికి తన వంతుగా రూ. 25 వేలను విరాళంగా అందజేయనున్నట్లు గొర్లె సన్యాసినాయుడు ప్రకటించారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వి. సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, గండిపడాల అప్పలరాజు, ఇట్లా వెంకటపతి, వాలేటి నాగరాజు, సోమిరెడ్డి పేరునాయుడు, కొల్లి ఈశ్వరరావు, ఎడ్ల బంగారయ్య, దాసరి లక్ష్మి పాల్గొన్నారు.

ఇంధన పొదుపుతో పర్యావరణానికి మేలు



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం: ఇంధన పొదుపుతోనే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని హెచ్‌ఎం కోసూరు రాము అన్నారు. జాతీయ ఇంధన పొదుపు దినోత్సవాన్ని గురువారం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా బయో డీజిల్, ఇథనాల్, హైడ్రోజన్, సోలార్ ఎనర్జీ వంటివి వాడాలన్నారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్ల ఫ్యామిలీ క్రిస్మస్

దేవరాపల్లి: జీసెస్ డిసైపుల్స్ పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్ల ఫ్యామిలీ ఐక్య క్రిస్మస్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏసు క్రీస్తు జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఏసు క్రీస్తు పాటల పాడి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావును పాస్టర్లు సత్కరించారు. రెవరెండ్ బంగారి సాల్మన్‌రాజు, సబ్బవరపు దేముడు పాల్గొన్నారు.



అభాగ్యులకు ఆసరా

ఈ చిత్రంలో తన కుమార్తెతో ఉన్న వ్యక్తి పేరు లంక శ్రీను, మాడుగుల మండలం కె.జె.పురం గ్రామం. అతడి కుమార్తె కవితకు అంతు చిక్కని వ్యాధి సోకడంతో మూడేళ్లుగా అనకాపల్లి, చోడవరం, విశాఖలో ఎన్నో ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వైద్య చికిత్సలు చేయించాడు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. లక్ష రూపాయల మేర ఖర్చు చేశాడు. రోగం నయంకాక మానసికంగా కుంగుబాటుకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో హిమటాలజీ వైద్యుల సూచన మేరకు కేజీహెచ్‌లో అన్ని రకాల పరీక్షలు చేసి సికిల్‌సెల్ ఏనీమియాగా నిర్ధారించారు. అప్పటి నుంచి ప్రతి నెలా రక్తమార్పిడి చేయించాల్సి వస్తోంది. పైగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఏఎన్‌ఎం సూచన మేరకు సదరం ధ్రువీకరణ పత్రం పొంది పింఛన్‌కు దరఖాస్తు చేశాడు. ఈ నెల 4న రాష్ట్ర **ప్రభుత్వం రూ.10 వేల పింఛను మంజూరు చేసింది. ఈ మొత్తం** ఇప్పుడు అతడి కుమార్తె వైద్య **ఖర్చులకు ఎంతో** ఉపయోగపడుతుందని **ఆనందం వ్యక్తం** చేస్తున్నాడు.





మాడుగుల రూరల్: సికిల్ సెల్ ఎనీమియా.. ఒక రకమైన రక్తహీనత. ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే బోన్‌మ్యారో టెస్ట్ (మూలగ మార్పిడి) చేయించుకోవాల్సి ఉంటుంది. దీనికి రూ.22 లక్షలకు పైగా ఖర్చవుతుంది. వ్యాధిగ్రస్తుల కుటుంబీకులు ఎవరైనా బోన్‌మ్యారోకు సహకరిస్తే వ్యాధిని నిర్మూలించవచ్చు.

వ్యాధి లక్షణాలు

దీర్ఘకాలం కామెర్లు, రక్తహీనత**తో శరీరం పాలిపోవడం**, కాళ్లు, చేతుల వేళ్లు వాపు**తో వంపు తిరగడం,** ప్లీహం వాచిపోయి ఉండటం **ఈ సికిల్ సెల్ వ్యాధి** ప్రధాన లక్షణాలు.

తలసేమియా జన్యుసంబంధమైన వ్యాధి. ఈ వ్యాధి సోకిన వారు పక్షం రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాల్సి ఉంటుంది.

వ్యాధి లక్షణాలు

తలసేమియా సోకిన పిల్లల పెదాలు, కళ్లు తెల్లబడడం, కడుపు ఉబ్బడం, కాళ్లు చేతులు వాపులు రావడం, రక్తం లెవెల్స్ తగ్గిపోవడం, నీరసంగా ఉండడం వంటివి లక్షణాలు ఉంటాయి.

వైద్య ఖర్చులకు ప్రతి నెలా రూ.10 వేల పింఛను సికిల్‌సెల్ ఎనిమియా, తలసేమియా బాధితులకు పౌష్టికాహారం, రక్తం ట్రాన్స్‌లేషన్ కోసం ప్రతి నెలా ప్రభుత్వం రూ. 10 వేల పింఛను అందిస్తోంది. వీరికి ఉచితంగా మందులు డి.ఇ.ఇ.సి ద్వారా ప్రతి నెలా అందిస్తున్నారు. మండలంలో మరో నలుగురికి పింఛను కోసం ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైతే అనర్హులు.

మాడుగుల మండలం

- కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో సికిల్ సెల్ ఎనీమియా బాధితులు : 1
- కింతలి పీహెచ్‌సీ పరిధిలో : 4
- వడ్డాది పీహెచ్‌సీకి సంబంధించి మాడుగుల మండలం 4 సచివాలయాల పరిధిలో : 4
- చికిత్సకు డి.ఇ.ఐ.సి. సెంటర్లు : విశాఖ కేజీహెచ్, పాడేరు ఏరియా ఆస్పత్రి

సికిల్ సెల్ ఎనీమియా.. తలసేమియా బాధితులు సకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతీ 15 రోజులకోసారి రక్తమార్పిడి చేయించుకోవాల్సి ఉంటుంది. లేకపోతే వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. దీని తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం అటువంటి వారికి ప్రతినెలా వైద్య ఖర్చులు, పౌష్టికాహారం నిమిత్తం రూ.10 వేల పింఛన్ అందిస్తూ ఆసరాగా నిలుస్తోంది.



కె.జె.పురంలో సికిల్‌సెల్ ఎనీమియా బాధితురాలికి పింఛను అందజేస్తున్న సర్పంచ్ రమణబాబు (ఫైల్)

వైద్య ఖర్చులకు తగ్గిన భారం



నా కుమారుడు రాజేష్‌ను ఎన్నో ఆస్పత్రులు చుట్టూ తిప్పాను. వేలకు వేలు ఖర్చయింది. వ్యాధి నిర్ధారించలేదు. చివరికి విశాఖ కేజీహెచ్‌లో సికిల్‌సెల్ ఏనీమియాగా నిర్ధారించారు. అక్కడ జారీ చేసిన సదరం ధ్రువపత్రం ఆధారంగా ఈ నెల నుంచి మాకు రూ.10 వేల పింఛను మంజూరైంది. వైద్య ఖర్చులకు భారం తగ్గింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఎంతో రుణ పడి ఉంటాం.

– తంటపురెడ్డి వరహాలునాయుడు, కొత్తపట్నం,అవురువాడ పంచాయతీ, మాడుగుల మండలం

కేజీహెచ్‌లో వ్యాధి నిర్ధారణ



ప్రతి నెలా సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు డి.ఇ.ఐ.సి కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. మూడో రకం హెటిరోజయగ్సెస్ ఎనీమియా బారిన పడిన వారిని వైద్య పరీక్షలు ద్వారా నిర్ధారించి వారికి సదరం ధ్రువపత్రాన్ని విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రిలో జారీ చేస్తారు.

– కె. లీలాప్రసాదు, వైద్యాధికారి, కె.జె.పురం పీహెచ్‌సీ, మాడుగుల మండలం

క్రీడా నైపుణ్యం వెలికితీతకు ‘ఆడుదాం ఆంధ్రా’



కార్యదర్శులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సత్యనారాయణ



క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎంపీపీ రాజు

మాకవరపాలెం/రావికమతం: గ్రామీణ క్రీడాకారుల్లో మరింత నైపుణ్యం వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహించనుందని ఎంపీపీలు రుత్తల సత్యనారాయణ, పైల రాజు అన్నారు. మాకవరపాలెం, రావికమతం మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం వారు సచివాలయాల కార్యదర్శులకు వేర్వేరుగా క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 17వ తేదీ వరకు నమోదు గడువును ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో వెంకన్నబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మీనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన



కె.కోటపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు


కె.కోటపాడు: పోస్టల్ ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని గొండుపాలెం, చౌడువాడ పోస్టల్ బ్రాంచ్ మాస్టర్లు బి.ఫణీంద్రపాత్రుడు, ఎన్.ఫణిశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం కె.కోటపాడు సబ్ పోస్టాఫీస్ వద్ద కె.కోటపాడు, ఎ.కోడూరు, దేవరాపల్లి సబ్ పోస్టాఫీస్‌ల జీడీఎస్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. కె.కోటపాడు మూడు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఎంలు మాట్లాడుతూ పోస్టల్ ఉద్యోగులకు 8 గంటల పనిని కల్పించాలని, పెన్షన్ విధానాన్ని రిటైర్‌మెంట్ ఉద్యోగులకు వర్తింపజేయాలని తెలిపారు. వీటితోపాటు గ్రాట్యూటీ, ఇన్సురెన్స్ కల్పించాలన్నారు. పోస్టల్ ఉద్యోగులు నాయుడుబాబు, సురేష్, శివ, వేణుగోపాల్, చంద్రుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం: నిరవధిక సమ్మెలో భాగంగా నర్సీపట్నం బ్రాంచ్ నాయకులు పి.దొరబాబు, వి.ప్రకాష్, తదితరులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. పి.ప్రసాద్, పి.లక్ష్మి, పోస్టల్ కార్మికులు పాల్గొన్నారు.

‘వై ఏపీ నీడ్స్ జగన్’పై విస్తృత ప్రచారం



నర్సీపట్నంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



పిండ్రంగిలో మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్



మంగళాపురంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు



రైవాడలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, బూరె బాబూరావు



మాడుగులలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్

నర్సీపట్నం/మాడుగుల/బుచ్చెయ్యపేట/దేవరాపల్లి/కె.కోటపాడు: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నర్సీపట్నం మున్సిపాలిటీ 3వ వార్డులో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఇక్కడ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధి ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి మళ్లీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని కోరారు.

మాడుగుల సచివాలయం –3లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్‌తో కలిసి ఎంపీపీ వేమవరపు రామధర్మజ పార్టీ జెండాను ఎగురవేశారు. సంక్షేమ, అభివృద్ధి వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ గురించి వివరించారు.

బుచ్చెయ్యపేట మండలం మంగళాపురంలో పార్టీ నాయకులతో కలిసి జెడ్పీటీసీ దొండా రాంబాబు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ముందుగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

దేవరాపల్లి మండలం రైవాడ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ జెండాను వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీతో కలిసి జెడ్పీటీసీ కర్రి సత్యం ఆవిష్కరించారు. ప్రతీ ఇంటికి వెళ్లి జగన్ చేసిన మేలును వివరించి సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, నాయకులతో కలిసి రాత్రికి అక్కడే భోజనం చేసి పల్లె నిద్ర చేశారు.

కె.కోటపాడు మండలం పిండ్రంగిలో సంక్షేమ లబ్ధితోపాటు గ్రామాభివృద్ధికి మంజూరు చేసిన నిధుల వివరాల బోర్డును ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ ఆవిష్కరించారు. ఇంటింటికీ వీటికి సంబంధించి ప్రజలకు వివరించారు. సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట: పెదమదీనలో గ్రామదేవత మరిడిమాంబ పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి గ్రామ శివారులో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చోడవరం స్వయంభూ వినాయకుని దేవస్థానం చైర్మన్ జయదేవ్, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, రాష్ట్ర కిసాన్ సెల్ కన్వీనర్ కే అచ్చింనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి ఆలయం వద్ద భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన

రోలుగుంట: జానకీరాంపురం శివాలయంలో నవగ్రహ ప్రతిష్టాపనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాడ రామకృష్ణ దంపతులు నవగ్రహ విగ్రహాలను ప్రతిష్టించారు. మాజీ సర్పంచ్ లగుడు లక్ష్మీతులసి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం చిడతల భజన, కోలాటం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, గోవాడ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ప్రత్యేక పూజలు చేశారు.

పార్టీ విజయమే లక్ష్యం కావాలి

మాకవరపాలెం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అంతా సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేటి కాశీవిశ్వనాథ్ కోరారు. గురువారం నర్సీపట్నం వెళ్తున్న ఆయనకు మాకవరపాలెం మండల నేతలు స్థానిక కామేశ్వరమ్మ ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. అనంతరం కాశీవిశ్వనాథ్ కామేశ్వరమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవింద, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, మండల యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, జిల్లా కార్యదర్శి నాయుడు, నాయకులు బొడ్డేటి వెంకటరమణ, సర్వేశ్వరరావు, వెలగా రమణ పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సమష్టిగా పని చేయాలి



కాశీవిశ్వనాథాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన బొడ్డేడ కాశీవిశ్వనాథం గురువారం నర్సీపట్నం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథం మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నర్సీపట్నం మెయిన్‌రోడ్డును ఎమ్మెల్యే దృఢ సంకల్పంతో విస్తరిస్తున్నారన్నారు. ఈ విధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే చేపట్టారన్నారు.

విద్యుత్ శాఖ ఏఈ తీరుపై సభ్యుల తీవ్ర ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గాడికాసు

చోడవరం: వివిధ సమస్యలపై మండల సమావేశం ఏకరువు పెట్టింది. కొన్ని శాఖల అధికారుల నిర్లక్ష్యం పనితీరు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన చోడవరం మండల సమావేశం గురువారం జరిగింది. తొలుత పంచాయతీ విస్తరణాధికారి మండల పరిషత్ నివేదికను చదివి వినిపించారు. అనంతరం శాఖల వారీగా పనితీరు నివేదిక ఉంచారు. ప్రధానంగా విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పనితీరుపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లో వోల్టేజీ, విద్యుత్‌లైన్ల సక్రమంగా లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయని సర్పంచ్‌లు గాడి అప్పారావు, కోసం సన్యాసిరావు నిలదీశారు. దాంతో ఈవోపీఆర్డీ చైతన్య స్పందించి శుక్రవారం విద్యుత్ శాఖ సిబ్బంది సమావేశంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. తిమ్మన్నపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కుళ్లిపోయిన గుడ్లు సరఫరా అవుతున్నాయని సర్పంచ్ గొర్లె రాము ధ్వజమెత్తారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుసుమ చెప్పారు. లక్ష్మీపురం, అంకుపాలెం మధ్యలో నర్సయ్యపేట వద్ద పంట కాలువ తవ్వకపోవడంతో లక్ష్మీపురం చెరువు నుంచి దిగువకు వస్తున్న వరద నీరు పొలాలను ముంచేస్తుందని కొందరు సభ్యులు ప్రశ్నించగా, వెంటనే ఎన్ఆర్‌జీఎస్ ద్వారా పనులు చేపడతామని అధికారులు తెలిపారు. ఇటీవల తుఫాన్‌కు దెబ్బతిన్న పెద్దేరు గట్టును పటిష్ఠ పరిచేందుకు రూ.60 లక్షలు, చాకిపల్లి గ్రోయిన్ మరమ్మతులకు రూ. 25 లక్షలతో ప్రతిపాదన పెట్టామని ఇరిగేషన్ ఏఈ తెలిపారు. ఇంటి స్థలం కోసం వచ్చిన 186 దరఖాస్తుల్లో 135 అర్హత కలిగినవిగా గుర్తించి వెంకన్నపాలెం, నర్సయ్యపేట ప్రాంతాల్లో ఇంటి స్థలాలు, ఇళ్లులు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ తిరుమలబాబు చెప్పారు. రీ సర్వే పనులు ఈ నెల 31వ తేదీతో పూర్తవుతుందన్నారు. ఎంఈవో రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజి పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రతి ఒక్కరి బాధ్యత



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న నాగలక్ష్మి, రమేష్‌బాబు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సురేష్‌నాయుడు

కె.కోటపాడు: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవడాన్ని బాధ్యతగా గుర్తించాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. స్థానిక శివాలయం వద్ద ఓటర్లతో వీరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కుతో శక్తివంతమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడం సాధ్యమన్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు కావాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి, ఆర్ఐ జానకి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నాతవరం: ఓటరు జాబితాలో తప్పొప్పులను సరి చేయాలని మండల ఎన్నికల ప్రత్యేకాధికారి కోటాన సురేష్‌నాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పోలింగ్ బూత్ సిబ్బంది, సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు నమోదు చేసిన, తొలగించిన ఓటర్ల వివరాలను ప్రత్యేక అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేస్తారన్నారు. ఆ సమయంలో నిబంధనలు ఉల్లఘించిట్టు గుర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు, డీటీలు చైన్లు, శివ పాల్గొన్నారు.

పంట నష్ట వివరాల సేకరణ



పొంగలిపాకలో పంట నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల: తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు ఈ నెల 18వ తేదీలోపు నమోదు చేయించుకోవాలని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. ఆయన గురువారం అవురువాడ, జి.అగ్రహారం, పొంగలిపాక గ్రామాల్లో పంట నష్ట వివరాలు నమోదును పరిశీలించారు. పంట నష్ట వివరాలు వేగంగా సేకరించి తమకు అందించాలని ఆయా గ్రామాల్లో వీఏఏ, వీహెచ్ఏ, ఇతర సిబ్బందికి సూచించారు. ఆర్బీకే సిబ్బంది గంగా భవానీ, స్వప్న, శ్రీనివాసరావు పాల్గొన్నారు.